ఆర్టీసీ కార్మిక పరిషత్ ప్యానల్‌ను గెలిపించాలి

- *ఆర్టీసీ బలోపేతం. కార్మికుల ఉద్యోగ భద్రతే లక్ష్యం.*
- *టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. మణిరాం సింగ్.*



దశ, బెల్లంపల్లి: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీలో జరగనున్న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో టీఎన్‌టీయూసీ అనుబంధ కార్మిక పరిషత్ ఎన్నికల బరిలో నిలుస్తుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. మణిరాం సింగ్ తెలిపారు. మంగళవారం మంచిర్యాల డిపో ఆర్టీసీ బస్టాండ్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆయన కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్టీసీ సంస్థను మరింత బలోపేతం చేసి పూర్వ వైభవం తీసుకురావడంతో పాటు కార్మికుల ఉద్యోగ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడమే కార్మిక పరిషత్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆర్టీసీలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడం, కొత్త డిపోల ఏర్పాటు, మహిళా సిబ్బందికి మెరుగైన రక్షణ, సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆర్టీసీలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయించేందుకు ప్రభుత్వంతో చర్చించి నిర్ణయం తీసుకునేలా ఒత్తిడి తీసుకువస్తామని మణిరాం సింగ్ పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియ పూర్తయ్యే వరకు కార్మిక పరిషత్ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. వన్‌మెన్ డ్రైవర్లకు ఉద్యోగ భద్రత కల్పించడం, వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం తమ ప్రధాన డిమాండ్లలో ఒకటని తెలిపారు. ప్రయాణికులు తప్పనిసరిగా టికెట్ తీసుకునేలా అవగాహన కల్పించి, టికెట్ తీసుకునే బాధ్యతను ప్రయాణికులపైనే ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనివల్ల డ్రైవర్లపై అదనపు బాధ్యత, ఒత్తిడి తగ్గుతుందని అన్నారు. ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగుల హక్కులు, సంస్థ పరిరక్షణ కోసం కార్మిక పరిషత్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.

కార్మికుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, ఆర్టీసీ అభివృద్ధి కోసం కృషి చేసే కార్మిక పరిషత్ టైర్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కార్మికులను కోరారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బొల్లు మల్లయ్య, మంచిర్యాల జిల్లా టీఎన్‌టీయూసీ అధ్యక్షులు ఓ.జీపరత్నం,ఆవుల సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గజ్జ దుర్గయ్య, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ టీఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ కార్యదర్శులు ఎన్. పుల్లయ్య, డి. అంజయ్య, సీహెచ్. కిష్టయ్య, ఆర్. గంగాధర్ గౌడ్, ఎస్.కె. అజ్వర్ భాష, బి. సత్యనారాయణ, బెల్లంపల్లి మండల్ అధ్యక్షులు రామటెంకి హరి బాబు తదితరులు పాల్గొన్నారు.

అభ్యాస స్కూల్ విద్యార్థి సాయిచరణ్‌కు రాష్ట్ర స్థాయి పరుగు పోటీలకు ఎంపిక



దశ, బెల్లంపల్లి: అభ్యాస స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న కొండి సాయిచరణ్ రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీలకు ఎంపికయ్యాడు. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి 60 మీటర్ల పరుగు పందెంలో ప్రతిభ కనబరిచి ఈ అవకాశాన్ని సొంతం చేసుకున్నాడు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రేపు జరగనున్న రాష్ట్ర స్థాయి పరుగు పందెం పోటీల్లో సాయిచరణ్ పాల్గొననున్నాడు. విద్యార్థి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడం పట్ల అభ్యాస స్కూల్ యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ నస్రీన్, పీఈటీ సంధ్య సాయిచరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి పాఠశాలకు, బెల్లంపల్లి ప్రాంతానికి మంచి పేరు తీసుకురావాలని ప్రిన్సిపాల్ నస్రీన్ ఆకాంక్షించారు. విద్యార్థిని క్రీడల్లో ప్రోత్సహిస్తూ రాష్ట్ర స్థాయికి తీర్చిదిద్దిన పీఈటీ సంధ్య కృషిని పాఠశాల యాజమాన్యం అభినందించింది.

బతుకమ్మ పండుగకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి



దశ, బెల్లంపల్లి: తాండూర్ మండలంలోని అన్ని గ్రామాల్లో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాలని సీపీఐ తాండూర్ మండల కార్యదర్శి కొండు బానేష్ కోరారు. పండుగ సందర్భంగా గ్రామాల్లో పనిచేయని వీధి లైట్లను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన ప్రాంతాల్లో కొత్త వీధి లైట్లను ఏర్పాటు చేసి విద్యుత్ స్తంభాలకు ఫిట్టింగ్ చేయాలని సూచించారు. రాత్రి వేళల్లో ప్రజలకు మెరుగైన వెలుతురు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, వీధి లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని బానేష్ విజ్ఞప్తి చేశారు. ప్రజలు బతుకమ్మ పండుగను సంతోషంగా, సురక్షితంగా జరుపుకునేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని కోరారు.



వెట్టిచాకిరీ నిర్మూలనపై విస్తృత అవగాహన కల్పించాలి.

'స్వేచ్ఛా రథం'ను ప్రారంభించిన అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి.

దశ, రంగారెడ్డి: వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రస్థాయి 'స్వేచ్ఛా రథం' ప్రచార కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి గురువారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టిచాకిరీ బాధితులు, అసంఘటిత రంగ కార్మికులకు వారి హక్కులు, అందుబాటులో ఉన్న సహాయ మార్గాలపై అవగాహన కల్పించడంతో పాటు 08069434343 టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్‌ను విస్తృతంగా ప్రచారం చేయడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

జిల్లాలో వెట్టిచాకిరీని పూర్తిగా నిరోధించేందుకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి బాధితులను గుర్తించడం, రక్షించడం, అవసరమైన సహాయం, పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలతో పాటు ఇతర అసంఘటిత రంగాల్లో వెట్టిచాకిరీకి గురయ్యే అవకాశాలు ఉన్నందున ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

అప్పులు, అడ్వాన్సులు, బెదిరింపులు, మోసం లేదా స్వేచ్ఛను హరించే విధంగా బలవంతంగా పని చేయించడం వెట్టిచాకిరీగా పరిగణించబడుతుందని, ఇది చట్టవిరుద్ధమని చంద్రా రెడ్డి స్పష్టం చేశారు. ఎలాంటి ఒత్తిడి, బెదిరింపులు లేదా శ్రమ దోపిడీ ఎదురైనా వెంటనే అధికారులకు సమాచారం అందించాలని కార్మికులకు సూచించారు.

జిల్లా వ్యాప్తంగా పర్యటించనున్న 'స్వేచ్ఛా రథం' ద్వారా కార్మికుల హక్కులు, వెట్టిచాకిరీని గుర్తించే విధానం, ఫిర్యాదు చేసే మార్గాలు, బాధితులకు అందించే ప్రభుత్వ సహాయంపై అవగాహన కల్పించనున్నారు. వెట్టిచాకిరీ ఘటనలపై 08069434343 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్మిక శాఖ, పోలీసు, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం (AHTU), జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (DLSA), మహిళా శిశు సంక్షేమ శాఖ (WCD)తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో జిల్లా కలెక్టర్ల నేతృత్వంలో 'స్వేచ్ఛా రథం' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

టీబీ రహిత గ్రామంగా రామన్‌పాడ్ ఎంపిక

కలెక్టర్ కార్యాలయంలో ప్రశంసాపత్రం అందుకున్న సర్పంచ్ అఫ్రీన్ బేగం అంజాద్ అలీ.



దశ, వనపర్తి: టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా 2025-26 సంవత్సరానికి వనపర్తి జిల్లా రామన్‌పాడ్ గ్రామం టీబీ రహిత గ్రామంగా ఎంపికైంది. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ అఫ్రీన్ బేగం అంజాద్ అలీ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (DMHO) డాక్టర్ భాస్కర్ నాయక్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు. టీబీ నిర్మూలనలో భాగంగా గ్రామంలో ఆరోగ్య శాఖ సూచనలు, అవగాహన కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయడంతో రామన్‌పాడ్ గ్రామం ఈ గుర్తింపును సాధించింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జెడ్పీ సీఈఓ యాదయ్య, డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్ నాయక్, ఎంపీడీఓ, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శి, ఆశా కార్యకర్తలు తదితరులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ అఫ్రీన్ బేగం అంజాద్ అలీ మాట్లాడుతూ.. టీబీ రహిత గ్రామంగా రామన్‌పాడ్ ఎంపిక కావడం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని అన్నారు. ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది అందించిన సలహాలు, సూచనలు, సహకారంతోనే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. గ్రామాన్ని టీబీ రహితంగా కొనసాగించేందుకు భవిష్యత్‌లోనూ ప్రజల సహకారంతో ఆరోగ్య శాఖతో కలిసి పనిచేస్తామని పేర్కొన్నారు.

టీబీ నిర్మూలనకు JOSH టీమ్ శుభారంభం



దశ, రంగారెడ్డి: రంగారెడ్డి జిల్లాలో టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా *JOSH టీమ్ (జాయిన్ ఓర్ సపోర్ట్ టూ ఎండ్ టీబీ)*ను జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి అధ్యక్షతన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ టీబీ నిర్మూలన లక్ష్య సాధనలో JOSH టీమ్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. యువత, విద్యార్థులు టీబీపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అనుమానిత కేసులను గుర్తించి సమీప ఆరోగ్య కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఓ, డీఈఓ, టీబీ అధికారులు, వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, JOSH టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ అరెస్టుకు నిరసనగా దిష్టిబొమ్మ దగ్ధం



దశ, రామన్నపేట: ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా కోరుతూ నిరసన కార్యక్రమానికి వెళ్తున్న కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు,మండల కేంద్రంలో సుభాష్ సెంటర్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్, అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు,

కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బిక్షం రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్ పూస బాలకిషన్, అబ్రహం కుమార్, గుత్తా నర్సిరెడ్డి, , వనం చంద్రశేఖర్, ఎండీ అక్రమ్, అంజిరెడ్డి, ఎండీ నాసర్, శంబాల వెంకన్న, కోట సుధాకర్, బొడ్డు సురేందర్‌రావు, అయ్యాడపు నర్సిరెడ్డి, లింగారెడ్డి, ఇనాయత్ బేగ్, జానీ,తదితరకాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఈసీ గ్యానేష్ కుమార్ రాజీనామా చేయాలి



దశ ఓయూ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) గ్యానేష్ కుమార్ రాజీనామా చేయాలని, ఆయనపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్టీఏ సభ్యుడు నెతికార్ సురేష్‌లాల్‌తో పాటు కిట్టు, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. సీఈసీపై ఆరోపణలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.



ట్రస్మా మండల నూతన కమిటి ఎన్నిక

దశ, రామన్నపేట: ట్రస్మా (తెలంగాణ రికాగ్నైజ్డ్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్) రామన్నపేట మండల నూతన కమిటిని గురువారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు పాలకుర్ల వెంకటేశం సమక్షంలో జరిగిన సమావేశంలో మండల కమిటీ గౌరవ సలహాదారుగా తిరుగుడు మల్లికార్జున్ (వివేకానంద స్కూల్), గౌరవాధ్యక్షుడు గా గంగుల నరేందర్ రెడ్డి (క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్), కమిటి ప్రెసిడెంట్ గా జె ఎస్ మార్టిన్ (మదర్ థెరీసా స్కూల్), వర్కింగ్ ప్రెసిడెంట్ గా కనకాచారి (చైతన్య విద్యాలయం, ఇంద్రపాలనగరం), ప్రధాన కార్యదర్శి గా నకిరేకంటి నాగరాజు (నాగార్జున స్కూల్), కోశాధికారిగా కె. శ్రీధర్ (పల్లవి స్కూల్) ఎన్నికయ్యారు. అనంతరం నూతన కమిటీని శాలువాలతో, పూల మాలలతో సన్మానించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీరాములు, జిల్లా గౌరవ అధ్యక్షుడు మెరుగు మధు, జిల్లా నాయకులు మిర్యాల దుర్గా ప్రసాద్, కాసుల వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అక్రమాలపై కాంగ్రెస్ యుద్ధభేరి

చలో లోక్ భవన్' సక్సెస్.

దశ, హైదరాబాద్: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో జరుగుతున్న అక్రమాలను అరికట్టి ప్రజల ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ పిలుపు మేరకు కాంగ్రెస్ పార్టీ గురువారం 'చలో లోక్‌భవన్' నిరసన కార్యక్రమం నిర్వహించింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, పలువురు మంత్రులు, సీనియర్ నాయకులతో కలిసి టీపీసీసీ లీగల్ సెల్ నాయకులు, కార్యకర్తలు ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్‌భవన్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ స్టేట్ కన్వీనర్ సత్యనారాయణ గుండ్లపల్లి పాల్గొని మాట్లాడారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు విశ్వాసం కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ఎన్నికల సంఘంపై ఉందన్నారు. ఓటర్ల జాబితా సవరణలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకమైన ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. అవకతవకలపై సమాధానం చెప్పలేకపోతున్న చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంక గాంధీ, ఇండియా కూటమి ఎంపీల అరెస్టులను ఖండించారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతులను అణచివేయడం సరికాదని, ప్రజల అసలైన బలం ఓటు హక్కేనని పేర్కొన్నారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించే వరకు టీపీసీసీ లీగల్ సెల్ పోరాటం కొనసాగిస్తుందని సత్యనారాయణ గుండ్లపల్లి స్పష్టం చేశారు.



ఘనంగా బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి జన్మదిన వేడుకలు



దశ ఓయూ: బీసీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. గురువారం జరిగిన వేడుకలకు వివిధ కుల సంఘాల ప్రతినిధులు సుంకోజు కృష్ణమాచారి, తాటికొండ శ్రీరాములు, రమేష్ చారి, గద్దల శ్రీనివాస్ చారి, మేడోజు శంకరాచారి,రామరాజు చారి, బ్రహ్మం, కమ్మర్ మహేష్ చారి, శ్రీపాద నరేష్, పండకండి సత్యనారాయణ, నాగపరం భాస్కరాచారి వివిధ బీసీ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చి కుందారం గణేష్ చారి ని శాలువలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గణేష్ చారి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సమాజానికి 63 సంవత్సరాలుగా జాతి ఉన్నతికి బీసీల అభివృద్ధి కోసం పనిచేస్తున్నానని తెలిపారు. విశ్వబ్రాహ్మణుల అభివృద్ధే ధ్యేయంగా వారి సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తున్నారని చెప్పారు. అనంతరం కేంద్ర మంత్రులు, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి కుందారపు గణేష్ చారి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వీబీజీ రామ్ జీ పథకంలో గ్రామాల అభివృద్ధి



దశ, ములకలపల్లి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలంలోని మూక మామిడి గ్రామపంచాయతీ పరిధిలోలో వీబీజీ రామ్ జీ పథకంలో ఫామ్ పాండు (భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గారు అండ్ ఆజీ వికాస్ మిషన్) పథకంలో భాగంగా పామ్ పాండ్ పనులను ప్రారంభించిన సర్పంచ్ కోర్స ఆదిలక్ష్మి, గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో పామ్ పాండ్ తవ్వకం పనులను కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలకు పనిముట్లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వీబీజీ రామ్ జీ పథకం ద్వారా గ్రామంలో అభివృద్ధి పనులతో పాటు కూలీలకు ఉపాధి కల్పిస్తున్నాం ఫామ్ పాండ్ వల్ల భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అర్హులైన ప్రతి కూలికి 125 రోజుల పని కల్పించేలా చర్యలు చేసుకుంటామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిఏ తాటి సత్యం, ఉపాధి హామీ సిబ్బంది గడ్డం వెంకటేష్, కీసరి గోపాల్ రావు, రామ జోగి, రాజబాబు, రవి, గ్రామ పెద్దలు మహిళలు కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత పోలీస్ శిక్షణను సద్వినియోగం చేసుకోండి



దశ కొల్లాపూర్ : కొల్లాపూర్ నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ప్రభుత్వం విడుదల చేసే ఉద్యోగ నోటిఫికేషన్లను సద్వినియోగం చేసుకుని, లక్ష్యం సాధించే వరకు నిరుత్సాహపడకుండా పట్టుదలతో ప్రయత్నించాలని నాగర్‌కర్నూల్ జిల్లా డీఎస్పీ బుర్రి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శౌర్య పోలీస్ అకాడమీ సహకారంతో కొల్లాపూర్ మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీఎస్పీ బుర్రి శ్రీనివాస్, కొల్లాపూర్ సీఐ శంకర్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు హైదరాబాద్‌కు చెందిన నిపుణులైన అధ్యాపకులతో సొంత ప్రాంతంలోనే ఉచిత శిక్షణ అందించడం అభినందనీయమన్నారు.

బట్లోని బావి కుంటకు హద్దులే కరువు!

కుంట్లూరులో హైడ్రా ఫెన్సింగ్‌తో కొత్త చర్చ.. సర్వే తీరుపై స్థానికుల అనుమానాలు.



దశ, పెద్ద అంబర్‌పేట్ : కుంట్లూరులోని బట్లోని బావి కుంట వ్యవహారం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. చెరువులు, కుంటల ఆక్రమణలపై హైడ్రా దృష్టి సారించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో.. అసలు కుంట విస్తీర్ణం ఎంత? ప్రస్తుతం ఎంత మిగిలింది? మిగిలిన భూమి ఎక్కడ? అనే ప్రశ్నలు స్థానికుల్లో వ్యక్తమవుతున్నాయి. సర్వే నంబర్ 24లో మొత్తం 84.21 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో బట్లోని బావి కుంటకు సంబంధించిన భూమి కూడా ఉంది. అయితే ప్రస్తుతం కుంట కేవలం ఎకరం 9 గుంటలకే పరిమితమైందని స్థానికులు చెబుతున్నారు.

ఏళ్లుగా కుంట చుట్టూ నిర్మాణాలు, రియల్ ఎస్టేట్ కార్యకలాపాలు పెరగడంతో నీటి వనరు క్రమంగా కుంచించుకుపోయిందనే ఆరోపణలు ఉన్నాయి. ఒకప్పుడు వర్షపు నీటిని నిల్వ చేసి భూగర్భ జలాల పెంపునకు దోహదపడిన కుంట.. నేడు ఆక్రమణల మధ్య తన ఉనికిని కాపాడుకునే పరిస్థితికి చేరుకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హైడ్రా ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం కుంట రక్షణకు తొలి అడుగే అయినా.. అసలు చిక్కు ఇక్కడే ఉందని స్థానికులు అంటున్నారు. కుంటకు పాత రికార్డుల్లో ఉన్న హద్దులు ఏమిటి? ప్రస్తుతం గుర్తించిన హద్దులు ఏమిటి? ఈ రెండింటి మధ్య తేడా ఎంత? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉందని వారు కోరుతున్నారు. మ్యాప్ ప్రకారం పక్కాగా సర్వే నిర్వహించలేదని కొందరు స్థానికులు ఆరోపిస్తున్నారు.

రెవెన్యూ, ఇరిగేషన్, హైడ్రా అధికారులు సంయుక్తంగా పాత రికార్డులు, మ్యాప్‌లు పరిశీలించి సమగ్ర సర్వే నిర్వహిస్తే కుంట ఎంత మేర ఆక్రమణకు గురైందన్న వాస్తవం బయటపడే అవకాశం ఉంది. కేవలం ఫెన్సింగ్‌తో సరిపెట్టకుండా కుంట భూములపై పూర్తిస్థాయి విచారణ జరిపి, ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కుంటల కబ్జాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తుందా? లేక ఫెన్సింగ్‌తోనే వ్యవహారం ముగుస్తుందా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బట్లోని బావి కుంటతో పాటు కుంట్లూరు పరిధిలోని ఇతర నీటి వనరుల హద్దులను కూడా స్పష్టంగా గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

బతుకమ్మ సంబురాలను విజయవంతం చేయాలి



- *ఓయూలో బీసీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ*

దశ ఓయూ: ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ (బీసీఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. అక్టోబర్ 10న సాయంత్రం 4 గంటలకు ఆర్ట్స్ కళాశాల ఆవరణలో బహుజన, బీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సైదులు యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ సంప్రదాయ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక అని అన్నారు. ప్రకృతి, స్త్రీశక్తి, కుటుంబ సౌభాగ్యానికి బతుకమ్మ ప్రతిరూపమని పేర్కొన్నారు. తెలంగాణ సంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకుంటూ బతుకమ్మను ఘనంగా నిర్వహించుకోవాలని పిలుపునిచ్చారు. బతుకమ్మ సంబురాలకు బహుజన మేధావులు, విద్యార్థులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఓయూ పీహెచ్‌డీ స్కాలర్లు పొన్నం ముత్యం గౌడ్, పేర్ల బాలు, సురేష్, పాల్వాయి విజయ్, రాష్ట్ర అధ్యక్షుడు భారీ అశోక్, నకిరేకంటి సైదులు, గణేష్, మీసాల మహేష్, వడ్డే గణేష్, ప్రభాకర్, శ్రవణ్, సాయికిరణ్, రాజశేఖర్, శివ, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

చలో లోక్‌భవన్‌లో కాంగ్రెస్ నేతల నిరసన

- *ఎస్ఐఆర్ అక్రమాలపై కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాజీనామా చేయాలి*

దశ ఓయూ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన 'చలో లోక్‌భవన్' కార్యక్రమంలో సికింద్రాబాద్ కంటెన్మెంట్ ఎమ్మెల్యే, ఇన్‌చార్జి ఆదం సంతోష్‌తో పాటు డీసీసీ ప్రధాన కార్యదర్శులు గండికోట కుమార్, రాజేందర్ యాదవ్ పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో జరిగినట్లు పేర్కొంటున్న అక్రమాలు, అవకతవకలకు బాధ్యత వహిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలంతా ఒకతాటిపైకి వచ్చి పోరాడాలని కాంగ్రెస్ నాయకులు పిలుపునిచ్చారు. లోక్‌భవన్ ముట్టడి కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గండికోట కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సికింద్రాబాద్, వడ్డే ఓబన్న ఉత్సవ కమిటీ సభ్యుడు తదితరులు పాల్గొన్నారు.



సీఐ వెంకటేశ్వర్లుకు 'కఠిన సేవా పతకం'!

శాంతిభద్రతల పరిరక్షణలో విశేష సేవలకు గుర్తింపు
అభినందించిన ఎస్పీ రోహిత్ రాజ్

దశ పినపాక : విధి నిర్వహణలో విశేష ప్రతిభ కనబరుస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమిస్తున్న పినపాక మండలం ఈబయ్యారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ప్రతిష్టాత్మక 'కఠిన సేవా పతకం' అందుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ చేతుల మీదుగా సీఐ వెంకటేశ్వర్లు ఈ పతకాన్ని గౌరవపూర్వకంగా స్వీకరించారు. పోలీస్ శాఖలో అంకితభావంతో పనిచేస్తూ ఆయన అందించిన విశిష్ట సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ.. ఏజెన్సీ వంటి అత్యంత కఠినమైన భౌగోళిక పరిస్థితుల్లోనూ సీఐ వెంకటేశ్వర్లు తన విధులను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారని కొనియాడారు. ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని ప్రశంసిస్తూ, ఆయనను ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నతాధికారుల నుంచి ఇంతటి గుర్తింపు లభించడం పట్ల సీఐ వెంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేస్తూ, పోలీస్ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు మరింత నిబద్ధతతో సేవలందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని అవార్డు గ్రహీత సీఐ వెంకటేశ్వర్లుకు శుభాకాంక్షలు తెలియజేశారు.


జర్నలిస్టుల సంక్షేమానికి సంపూర్ణ సహకారం

ఎమ్మెల్యే జారె ఆదినారాయణ భరోసా



దశ, అశ్వారావుపేట: ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు తెలంగాణ జర్నలిస్ట్ మీడియా యూనియన్ (టీజేఎంయూ) కృషి చేస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు ఇనుపనూరి ప్రభాకర్ అన్నారు. అశ్వారావుపేట పట్టణంలోని కెమిలాయిడ్స్ గెస్ట్‌హౌస్‌లో గురువారం నిర్వహించిన టీజేఎంయూ నియోజకవర్గ స్థాయి మహాసభలు ముగిశాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య జర్నలిస్టులు వారధిగా పనిచేస్తున్నారని అన్నారు. నియోజకవర్గ జర్నలిస్టుల సంక్షేమానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు, విద్యా రాయితీలు కల్పించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. విధి నిర్వహణలో జర్నలిస్టులు ఎదుర్కొనే సమస్యలు, కేసుల విషయంలో అండగా ఉంటానని, ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్‌బాబు మాట్లాడుతూ జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. వాస్తవాలను పరిశీలించి వార్తలు ప్రచురించడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందన్నారు. టీజేఎంయూ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు ఇనుపనూరి ప్రభాకర్ మాట్లాడుతూ అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు, పింఛన్లు, హెల్త్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. చిన్న పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలను సమానంగా కేటాయించాలని కోరారు. జర్నలిస్టుల సమస్యలు, కేసుల విషయంలో టీజేఎంయూ అండగా ఉంటుందని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో మహాసభలు నిర్వహించి జిల్లాస్థాయిలో భారీ సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. జర్నలిస్టులకు వార్తా రచనపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్‌యూజేఐ అనుబంధ సంస్థగా జర్నలిస్టుల హక్కుల కోసం మరిన్ని కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీజేఎంయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు సామల ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ఏఎం కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పాతగట్ల రవితో పాటు పలువురు విలేకరులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో టీజీటీటీఎఫ్ నూతన కమిటీ



దశ అశ్వారావుపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ (TGTTF) అశ్వారావుపేట మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. TGTTF రాష్ట్ర ఉపాధ్యక్షుడు హలావత్ హరిబాబు, జిల్లా అధ్యక్షుడు వి. రమేష్‌బాబు అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతంలో GO No.3 స్థానంలో కొత్త జీవో తీసుకువచ్చి చట్టబద్ధత కల్పించాలని, రెండో పీఆర్‌సీ ఫిట్‌మెంట్‌ను 51 శాతంగా ప్రకటించాలని కోరారు. పీఆర్‌సీలో ఏజెన్సీ అలవెన్స్, 10 శాతం AHRA, SCAను రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు.